ప్రజాశక్తి
బుధవారం 15 నవంబర్ 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా







జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వేదికపై కలెక్టర్లు పి.రాజాబాబు, ఎస్.డిల్లీరావు తదితరులు

టీచర్ల కొరతపై ఆగ్రహం

ఉమ్మడి కృష్ణాజిల్లా జడ్‌పిలో సమస్యలను ఏకరువు పెట్టిన సభ్యులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపిపిలు సమస్యలు ఏకరువుపెట్టారు. మంగళవారం మచిలీపట్నం జడ్పీ కన్వెన్షన్ హాలులో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎజెండాలోని అంశాల వారీగా చర్చ నిర్వహించారు. కృష్ణా, ఏలూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విద్యారంగ సమస్యలపై సుదీర్ఘంగా చర్చకొనసాగింది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, నాడు-నేడు పనులు, సమగ్ర శిక్ష బిల్లులు పెండింగ్, పంటలు ఎండినా కరువు మండలాల జాబితాలో ఆయా మండలాలను చేర్చకపోవడం వంటి అంశాలపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా నుంచి కొన్ని శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు రాకపోవడంపై మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాఠశాలలకు తాళాలు వేయండి : ఎమ్మెల్యే దూలం

'మా నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సంఖ్యలో టీచర్లు లేరు. పిల్లల భవిష్యత్ ఏమవుతుంది ? సమస్యను కృష్ణా, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్ళా. 45 రోజులైనా సమస్య పరిష్కారం కాలేదు. ఇంటికి వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు (మిగతా 6లో)

జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం ఇళ్ల కేసులో

టిడిపి మాజీ కార్పొరేటర్ కొట్టేటి అరెస్టు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పేదలకు ఇళ్లిప్పిస్తామని నమ్మించి మోసం చేసిన కేసులో ఐదో నిందితుడిగా ఉన్న టిడిపి నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొట్టేటి హనుమంతరావును మంగళవారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి సుమారు రూ.2 కోట్ల వరకు వసూలు చేసి మోసగించారని గత నెలలో కొంత మంది బాధితులు టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టుచేసి రిమాండ్ తరలించారు. ఐదో నిందితుడైన కొట్టేటి హనుమంతరావును మంగళవారం కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో ఆయనను విజయవాడ సబ్ జైలుకు తరలించారు.

రెడ్డిగూడెంలో ఘర్షణ

కానిస్టేబుల్‌తో సహా ఇద్దరికి గాయాలు : స్వల్ప లాఠీఛార్జి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం శివారు రాఘవపురంలో రెండు సామాజిక వర్గాల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈఘర్షణలో కానిస్టేబుల్‌తో సహా ఇద్దరికి గాయాలయ్యాయి. రెండు వేర్వేరు సామాజివర్గాలకు చెందిన యువకులకు ఆదివారం రాత్రి రహదారిపై బాణాసంచా కాల్చే విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి సోమవారం రాత్రి కూడా ఆ యువకులు కర్రలు, రాళ్లతో కవ్వింపు చర్యలకు దిగారు. ఒకరిని నొకరిపై దాడులకు పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువైపుల వారిని శాంతింపజేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈసంఘటనలో రెడ్డిగూడెం పోలీసుస్టేషన్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శాంతి భద్రతలకు ఆటంకం కలుగుతుండటంతో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జి చేసి శాంతి భద్రతలను అదుపు చేశారు. ఎసిపి రమేష్, మైలవరం సీఐ డీకే మోహన్ రెడ్డి, రెడ్డిగూడెం ఎస్ఐ శ్రీను, మైలవరం, విసన్నపేట ఎస్ఐలు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత నిర్వహించారు. ఇరు సామాజిక వర్గాల మధ్య మరోసారి ఘర్షణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మైలవరం సీఐ మోహనరెడ్డికి ఎసిపి రమేష్ సూచించారు.



బహిరంగ సభ వేదిక


నగరంలో భారీ జెండాలతో అలంకరణ, ప్రధాన సెంటరులో తోరణాలు, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి విజయవాడ రైల్వేస్టేషన్లో దిగిన పార్టీ శ్రేణులు, వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, సిహెచ్.బాబూరావు, డి.కాశీనాథ్

నగరం ముస్తాబు

సిపిఎం రక్షణ భేరి బహిరంగ సభ, ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి • తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలతో అలంకరణ

ప్రజాశక్తి - విజయవాడ : సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బుధవారం జరిగే సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు నగరం ముస్తాబైంది. సభ జరిగే సింగ్‌నగర్‌తోపాటు మహా ప్రదర్శన ప్రారంభమయ్యే బిఆర్‌టిఎస్ రోడ్డు పరిసర ప్రాంతాలను తోరణాలతో అలంకరించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పెద్ద పెద్ద హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీధివీధిన డోర్ పోస్టర్లు అంటించారు. ప్రదర్శన సాగే బిఆర్‌టిఎస్ రోడ్డులోని ఫుట్‌జంక్షన్, పడవుల రేవు, ముత్యాలంపాడు, బుడమేరు వంతెన, సింగ్‌నగర్ ఫ్లైఓవర్, డాబాకొట్టు, కృష్ణాహోటల్ సెంటర్లతోపాటు సభ జరిగే ఎంబి స్టేడియం ప్రధాన రహదారి తోరణాలతో (మిగతా 6లో)

వివిధ జిల్లాల నుండి శ్రేణులు రాక

మంగళవారం రాత్రి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో వందలాది మంది విజయవాడ రైల్వేసేషన్‌లో దిగారు. ఉత్తరాంధ్రా జిల్లాలకు చెందిన పార్టీ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని ముందుగానే సభకు తరలివచ్చాయి. వీరిలో మహిళలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. ఇంకా పలు జిల్లాల నుండి బస్సులు, రైళ్లు, ప్రత్యేక వాహనాల్లో అర్ధరాత్రికే నగరానికి చేరుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న కవాతు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి : అసమానతలు లేని అభివృద్ధి కోసం అనే నినాదంతో బుధవారం నగరంలో సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ జరుగుతుంది. ముందుగా నగరంలోని బిఆర్‌టిఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుంచి అజిత్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్న స్టేడియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రదర్శన అగ్రభాగాన పార్టీ అగ్రనేతలను అనుసరిస్తూ రెడ్ షర్ట్, శారీస్ వాలంటీర్లు కవాతు నిర్వహించనున్నారు. అనంతరం స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుంది. పిఎన్‌ఎం కళా బృందాల ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

పుస్తక పఠనంతో ఎంతో భవిష్యత్తు

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పుస్తక పఠనంతో విజ్ఞానంతోపాటు ఊహాత్మక, సజనాత్మక శక్తి సొంతమవుతుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. అందువల్ల విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవాలని కోరారు. విజయవాడ కొత్తపేటలోని కాకరపర్తి భావనారాయణ (కేబీఎన్) కళాశాలలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవ, బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ సమాజంలో గ్రంథాలయాలు, గ్రంథపాలకుల ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు పుస్తక పఠనం అలవాటుతో పొందే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలన్నారు. పుస్తక పఠనంతో ఇన్ఫర్మేషన్‌తోపాటు ఇమాజినేషన్ నైపుణ్యాలు అలవడతాయని, తద్వారా మేధో వికాసం జరుగుతుందని అన్నారు. అకడమిక్ పుస్తకాలతో పాటు గ్రంథాలయాలను సందర్శించి సునిశిత పరిశీలన ద్వారా భిన్న పుస్తకాలు చదివి, సారాంశాన్ని ఆకళింపు చేసుకోవడం ద్వారా సర్వతోముఖాభివృద్ధి దిశగా అడుగులేయాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఈ-బుక్స్, ఆడియో బుక్స్ వంటివి అందుబాటులో ఉన్నాయని, ఇలాంటివి ఎన్నిఉన్నా పుస్తకం విలువ ఎప్పుడూ ఉన్నతమేనని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ కళాశాలలో ప్రత్యేకంగా లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఉందని, భిన్న పుస్తకాలతో కూడిన అధునాతన గ్రంథాలయం ఉందని వివరించారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు.. కళాశాల గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.శ్రీనివాస్, కోఆర్డినేటర్ కె.రామకష్ణ, లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ వై.శ్రీనివాస రాజు, ఇంటర్మీడియెట్ విభాగం ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ టి.భాగ్యకుమార్ పాల్గొన్నారు.


కెబిఎన్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు, చిత్రంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు తదితరులు

ప్రశాంత్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

జగ్గయ్యపేట: తెలంగాణ రాష్ట్రం మధిర నియోజక వర్గం బొనకల్ శాంతి నివాసం మానసిక వికలాం గుల పాఠశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను, విమలభాను తనయులు యువనాయకులు సామినేని ప్రశాంత్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మానసిక వికలాంగులకు స్వీట్లు, పండ్లు, పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచారు. అనంతరం సుమారు 100 మందికి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో రాజన్న ఉచిత భోజనం క్యాంటీన్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. రాజన్న ఉచిత భోజన కార్యక్రమంలో 2 వేలమందికి ఉచిత భోజనం అందజేశారు.

స్పార్క్స్ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పాదరక్షల బ్రాండ్‌లో అగ్రగామిగా ఉన్న స్పార్క్స్ శీతాకాలం సందర్భంగా సరికొత్తగా నూతన బూట్లు, చెప్పులు, ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ దువా తెలిపారు. నగరంలోని స్పార్క్స్ డీలర్‌షిప్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన శీతాకాలం సందర్భంగా 23 రకాల ఉత్పత్తులను పరిచయం చేశారు. అనంతరం మాట్లాడుతూ లేటెస్టు కలెక్షన్, స్టైల్, కంఫర్ట్, క్వాలిటీకి తమ సంస్థ అత్యుత్తమంగా నిలుస్తుందన్నారు. సరికొత్త కలెక్షన్‌ను తమ సంస్థ ఎప్పటికప్పుడు వినియోగదారుల కోరిక మేరకు అందిస్తుందన్నారు. రోజువారీ పనులను మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు మరింత శక్తిని అందించేలా స్పార్క్స్ ఫుట్‌వేర్ పనిచేస్తుందన్నారు.

38వ డివిజన్లో ఎమ్మెల్యే వెలంపల్లి పర్యటన


పర్యటిస్తున్న వెలంపల్లి

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 38వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను మంగళ వారం పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యుల వెలంపల్లి శ్రీనివాసరావు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మల్లికార్జున పేట కమ్యూనిటీ హాల్‌ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కరెంట్ ఇబ్బందులు లేకుండా సబ్ స్టేషన్ ఏర్పాటుకి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొండపైకి వెళ్లేందుకు ర్యాంపులను అభివృద్ధి చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ గుడి ధర్మకర్త బుద్దా రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

స్థానిక ప్రజలు ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని 35,38,49 డివిజన్లలో మూడు సచివాలయలలో పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు సందర్శించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బాలసాని మన్నెమ్మ,షేక్ రేహమతున్నిసా, బుల్లా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గం తాటిగుమ్మి గ్రామంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ వీరులపాడు మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షులు యం.జయరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొక్కా జార్జి ముల్లర్ మాట్లాడుతూ ప్రతి సేవకున్ని ప్రభువు గొప్ప పిలుపుతో పిలిచి సేవా పరిచర్య జరిగించటానికి ఎన్నుకున్నాడని, ప్రజలకు చేరువుగా సేవ ఫలితాలు ఉండాలని తెలిపారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ద్వారా అనేకమైన ప్రాజెక్టులు అందుబాటులోనికి రానున్నాయని, వాటిని ప్రతి పాస్టర్ వినియోగపరుచుకోవాలని కోరారు. అనంతరం గుర్తింపు కార్డులు పంపిణీ, నూతన సభ్యుల నమోదు కార్యక్రమాలు జరిగాయి. ఈ సమావేశంలో రీజినల్ చైర్-పర్సన్ పిల్ శంకర రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కే హనోకు, నందిగామ మండల అధ్యక్షులు జకరయ్య, మధుబాబు, కంచికచర్ల మండల అధ్యక్షులు ఇమ్మానుయేలు, పాల్గొన్నారు.

డిపో కార్మికులపై పని భారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్యపేట డిపో కార్మికులపై పని భారం పెంచుతూ డిపో యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని అసోసియేషన్‌లో వ్యతిరేకిస్తూ గేట్ మీటింగ్‌లు, వినతి పత్రాలు అందజేసినా యాజమాన్యం మొండి వైఖరిగా అవలంబిస్తుందని కార్మిక నాయకులు తెలిపారు. జగ్గయ్యపేట డిపో నష్టాల బారి నుండి బయటపడేందుకు గతంలో స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కేసర టోల్ గేట్‌లో రాయితీ ఇప్పించారన్నారు. ప్రస్తుతం కార్మికులపై పడుతున్న భారాల నుండి యాజమాన్యం మొండి వైఖరికి వ్యతిరేకంగా ఉదయభాను కార్యాలయంలో మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు గంటా భాస్కరరావు, ఎ.ఆనంద్, వడ్లమూడి రాంబాబు, జె.సాంబశివరావు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల బియ్యం వితరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాజన్న ఉచిత భోజన కార్యక్రమానికి పలువురు 30 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కొనకంచి గ్రామ సర్పంచ్ గోనెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాస్, సొసైటి అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, దేవస్థానం చైర్మన్ వెంకట్రావు, మాజీ దేవస్థానం చైర్మన్ వెంకయ్య వార్డు మెంబర్స్, నాయకులు, కార్యకర్తలు రూ.1.50 లక్షల విలువైన బియ్యాన్ని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను చేతులమీదుగా అందజేశారు.

మధుమేహం నివారణపై అవగాహన


కంచికచర్లలో మధుమేహంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కంచికచర్ల : విజయవాడ వాసన్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మధుమేహంపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ మాధవి లత, షుగరు వ్యాధి వలన కంటి మీద పడే ప్రభావం, షుగరు వ్యాధి మన శరీరం మీద ఎలాంటి ప్రభావం పడుతుంది, షుగరు వ్యాధిని ఎలా అదుపులో ఉంచుకోవాలో వివరించారు. విజయవాడ వాసన్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో షుగరు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. డిసెంబర్ 13 వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. **తిరువూరు :** తిరువూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం తిరువూరులో మంగళవారం నిర్వహించారు. ఏ సందర్భంగా వాకర్స్‌కు షుగర్, బి.పి, థైరాయిడ్, హార్ట్ సమస్యలపై ముఖ్య అతిథి ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ పూర్ణ అవగాహన కల్పించారు. అనంతరం వాకర్స్ అడిగిన ప్రశ్నలకు ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

రాష్ట్ర పౌర గ్రంథాలయం సంచాలకులు ఆదేశానుసారం "56వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలు" జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాల్లో క్విజ్, వ్యాసరచన, పుస్తక పఠనం, పలు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులందజేశారు.


నందిగామలో వారోత్సవాలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

నందిగామ : విజ్ఞానాన్ని పెంపొందించేది గ్రంథాలయాలేనని, ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవర్చుకోవాలని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని గ్రంథాలయ శాఖలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు ప్రారంభించి మాట్లాడారు. సిఎం జగన్ గ్రంథాలయాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారని.. గ్రంథాలయాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి పుస్తక పాఠకుల కోసం ప్రత్యేక వసతులను కల్పిస్తున్నారన్నారు. **జగ్గయ్యపేట :** గ్రేడ్-1 శాఖ గ్రంథాలయం జగ్గయ్యపేట మంగళవారం మున్సిపల్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, సభ అధ్యక్షులుగా కవి, పాల్గొన్నారు. గ్రంథాలయంపై కవి ఎస్ నరసింహారాజు పాట పాడారు. గ్రంథాలయం అధికారి ఆలేటి ప్రభ పాల్గొన్నారు. ధర్మవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఇఒ ఎల్.చిట్టిబాబు గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. **కంచికచర్ల :** శాఖా గ్రంథాలయంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జాతీయ జెండా ఎగురవేశారు. గ్రంథాలయ అధికారి అల్లూరి రామచంద్రుడు అధ్యక్షత వహించగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, నెహ్రూ చిత్రపటాలకు నివాళులర్పించారు. **మైలవరం :** మండల గ్రంథాలయంలో మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు నాగిరెడ్డి పాల్గొన్నారు. **విజయవాడ :** రామ్మోహన్ గ్రంథాలయంలో అరుదైన పుస్తక ప్రదర్శన, చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రంథాలయ కార్యదర్శి శ్రీ వేములపల్లి కేశవరావు పాల్గొన్నారు. **గంపలగూడెం :** స్థానిక గ్రంథాలయ శాఖలో స్థానిక సర్పంచ్ కోట పుల్లమ్మ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. పెనుగంచి గ్రంథాలయ శాఖలో ఇన్‌ఛార్జ్ శ్రీలత ప్రారంభించారు. **చందర్లపాడు :** శాఖా గ్రంథాలయం ఏటూరులో గ్రామ సర్పంచ్ మామిడి వెంకటేశ్వరరావు వారోత్సవాలు ప్రారంభించారు. శాఖా గ్రంథాలయ అధికారి డి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం గ్రంథాలయంలో సర్పంచ్ రాణి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. **విజయవాడ :** చిత్తరంజన్ గ్రేడ్ – 2 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, శాసన సభ్యులు మల్లాది విష్ణు వర్ధన్, డిప్యూటీ మేయర్ ఎ.శైలజ, స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి జ్యోతి ప్రజ్వలనతో వారోత్సవాలు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ శైలజ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - విజయవాడ :** గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు (నెల్లూరు) ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ అన్నారు. వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం లో ఏడు రోజులపాటు నిర్వహించే జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. నిర్వహణ గ్రంథాలయ అధికారిణి బి కృష్ణప్రియ తదితర సిబ్బంది చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

భారత దేశ తొలి ప్రధాని, భారత స్వాతంత్య్ర పోరాట నాయకుడు, భారత రాజకీయలలో శక్తివంతమైన నెహ్రూ, గాంధీ కుటుంబానికి మూలపురుషుడు జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు పలు దేశభక్తుల వేషధారణలో అలరించారు. పలుచోట్ల పోటీలు నిర్వహించి చిన్నారులకు బహుమతులందజేశారు.


నున్న స్కూల్లో ట్రోఫీని అందజేస్తున్న జ్యోతి సురేఖ

ప్రజాశక్తి -ఎడ్యుకేషన్ : విద్యార్థులు ఎప్పుడైతే క్రీడలు, ఆటలతో పాటు చదువులో రాణిస్తారో అప్పుడే జీవితంలో స్థిరపడతారని ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు సాధించిన ఇంటర్నేషనల్ ఆర్చర్, అర్జున అవార్డు గ్రహీత, ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ పాల్గొన్నారు. ఇటీవల బ్యాంకాక్‌లో జరిగిన ఆర్చరీ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆమె టీమ్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. **వన్‌టౌన్ :** జవహర్ లాల్ నెహ్రూ 134 జయంతి సందర్భంగా కొత్తపేట నెహ్రూ చౌక్ వద్ద వున్న పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరి శెట్టి నరసింహారావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. **భవానీపురం :** గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ ఊర్మిళానగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 39వ డివిజన్‌లోని భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌లో దీపావళి, బాలల దినోత్సవ వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ జె.సునీత మాట్లాడారు. భవానీపురం ప్రాంతంలో మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసిన భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ సేవలు మానసిక స్థితిసరిగా లేని పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 9985951397 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. **మైలవరం :** స్థానిక వివేకానంద, నారాయణపాఠశాలలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. పోటీల్లోని విజేతలకు బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ రాజారెడ్డి, ప్రిన్సిపల్ రత్నకుమారి పాల్గొన్నారు. **గంపలగూడెం :** బాలల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం 267 మంది విద్యార్థినులకు దుప్పట్లు వితరణ చేసినట్లు స్థానిక కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటలక్ష్మి తెలిపారు. తోటమూలకు చెందిన అశ్వద్దామ చారిటబుల్ ట్రస్ట్ ఈ దుప్పట్లు వితరణగా అందజేశారు. **జగ్గయ్యపేట:** మండలంలోని గండ్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు మాట్లాడారు. ధర్మవరప్పాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఇఒ ఎల్.చిట్టిబాబు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కంచికచర్ల :** మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు మంగళవారం కంచికచర్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయవాడ – హైదరాబాద్ రోడ్డు పక్కన గల నెహ్రూ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. **తిరువూరు :** అంతర్జాతీయ బాలల దినోత్సవం తిరువూరులో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. బాల బాలికలు జాతీయ నాయకుల వేష ధారణతో పలువురిని ఆకర్షించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి అందజేశారు. **విజయవాడ :** పూర్ణానందంపేట మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు ఆర్ట్ యాక్టివిటీ వర్క్‌షాప్, కాంపిటీషన్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు లతా తెలిపారు. స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ స్ఫూర్తి శ్రీనివాస్, డాక్టర్ వై.భవన్ చంద్ మాట్లాడారు.


బంటుమిల్లిలో...



హనుమాన్‌జంక్షన్‌లో...

ఘనంగా బాలల దినోత్సవం

దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలు మంగళవారం కృష్ణాజిల్లాలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

గన్నవరం: వికెఆర్ కళాశాలలో జరిగిన బాలల దినోత్సవం వేడుకల్లో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో బాలల దినోత్సవం నిర్వహించారు. సభకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాల కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా ఎయిర్ పోర్టు మాజీ డైరెక్టర్ ముక్కామల సుబ్బారావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.కృష్ణమోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీసం ప్రసాద్ రావు, కోశాధికారి గంపా సాంబశివరావు, కమిటీ సభ్యుడు జగన్ తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** వడ్లమన్నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మోదుగు మూడి అంకాలరావు, పామర్తి వీర రాఘవులు, వి-క్యూబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ప్రథమ ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు 30 వేల రూపాయలు మెమొంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. పెడన పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థిని రెండో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న భవానీకి పది వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్నేరు ప్రభాకర్‌రావు, పాఠశాల హెచ్ఎం ప్రసాదు ఫౌండేషన్ అధినేత పివి రాఘవులు ఆరుగొలను పాఠశాల ఉపాధ్యాయులు స్టాలిన్ పెడన,పట్టణ ప్రైవేట్ పాఠశాల అధినేత సాంబశివరావు పాల్గొన్నారు. ఏఎఎన్ఎం అండ్ వివిఆర్ ఎస్ ఆర్ హై స్కూల్ నందు నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య సలహాదారులు డాక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు. **ఉంగుటూరు:** ఉంగుటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జె.సాంబశివరావు, హెచ్ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **చల్లపల్లి:** 1వ, 12వ అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించిన వేడుకలలో నెహ్రూ వేషధారణలో పిల్లలు ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు షేక్ ముంతాజ్ బేగం, సిహెచ్ గంగాభవాని, సహాయకులు అంబటి లలిత, మహమ్మద్ షం సన్నీసా పాల్గొన్నారు. **బంటుమిల్లి:** బాలోత్సవ్, అవార్డ్స్ డే కార్యక్రమాలను కొమ్మారెడ్డి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ఆంధ్ర ప్రదేశ్ ఐడి దేవానంద రెడ్డి, ఎంఈఓ-1, 2 త్రిపుర సుందరి, వెంకటేశ్వరరావు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. అనంతరం చిన్నారులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. బంటుమిల్లి సెయింట్ జాన్స్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సాబుజాన్, ప్రిన్సిపాల్ ఝాన్సీ పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్:** స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు విచిత్రమైన వేషధారణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.రాజేష్, పెదపాడు ఎంఈఓ యస్.నరసింహామూర్తి, ఎ.జి.యం యస్.పార్థసారధి పాల్గొన్నారు. **అవనిగడ్డ:** గాంధీ క్షేత్రంలో నెహ్రూ విగ్రహానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, యాసం చిట్టిబాబు, బావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ పాల్గొన్నారు. అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బాలల దినోత్సవం పురస్కరించుకొని నెహ్రూ చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు నెహ్రూ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. **గుడివాడ:** గుడివాడ రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి విద్యాసంస్థలలో పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధ, తదితరులు పాల్గొన్నారు.


గుడివాడలో...


గుడ్లవల్లేరులో...


ఘంటసాలలో...


గన్నవరంలో...


ఉంగుటూరులో...

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: అక్రమంగా గంజాయి లాంటి మత్తు పదార్థాలు తరలించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జనార్ధన్ హెచ్చరించారు.మంగళవారం ఉదయం గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నరు.వారు తెలిపిన వివరాల ప్రకారం పెరికీడు వద్ద జాతీయ రహదారి పై వాహనతనిఖీలు నిర్వహిస్తున్న హనుమాన్ జంక్షన్ ఎస్సై ఎ.డీ.ఎల్. జనార్ధన్ రెండు స్కూటీలపై విజయవాడవైపు వెలుతున్న వారిని తనిఖీ చేయగా గంజాయి రవాణా చేస్తున్నారన్నారు. విజయవాడకు చెందిన పల్లిపోగు సాయిచైతన్య, లండా ప్రేమకుమార్లతో పాటు ధారకొండ గ్రామానికి చెందిన మహిళ శెట్టి అన్నపూర్ణ అనే మహిళలను అదుపులోకి తీసుకుని వారివద్ద నుండి 4కేజీల గంజాయి, తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై జనార్ధన్ తెలిపారు.

విద్యార్థులకు పెన్సిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు: లయన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ కంకిపాడు ఆఫీస్ బేరర్ అయిన మేకలు పార్వతీశ్వరరావు ఆర్థిక సహకారంతో మండలంలోని మానికొండ గ్రామంలో వివిధ పాఠశాలల్లో 120 మంది పిల్లలకు వివిధ రకాలైన డ్రాయింగ్ బుక్ పెన్ను పెన్సిల్ కలర్ పెన్సిల్ బాక్స్ జామెంట్రీ బాక్స్ మొత్తం సెట్ గా అందించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక నగర్ పాఠశాలలో జరిగిన సభలో లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కె నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నెహ్రూ జయంతి సందర్భంగా పిల్లలకు బహుమతులు అందజేసి వారిని విద్యావంతులుగా ప్రోత్సాహం అందించడం నెహ్రూ ఆశయాల సాధనకు నిజమైన పునాదులని అభినందించారు ఈ కార్యక్రమంలో దాత మేకల పార్వతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మలమేహ దినోత్సవం పురస్కరించుకొని మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తాళ్లపాలెం పిహెచ్చి వైద్యులు డాక్టర్ కె సుమప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆ వ్యాధి రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలను వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లు రసాయనాలు క్రిమిసంహారక మందులతో పండించిన పంటలు వాడటం ఒత్తిడితో కూడుకున్న జీవన విధానం మదమేహానికి ప్రధాన కారణాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు.చేసిన మహిళా సాధికారత విభాగాధిపతి రత్నకుమారిని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అధ్యాపకులు ప్రశంసించారు.

గాజుల గోపి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: వైసిపి యువజన విభాగం కార్యదర్శి మాజీ గ్రామ ఉపసర్పంచ్ గాజుల జయ గోపాల్ జన్మదిన వేడుకలు అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గోపి కేక్ కట్ చేయగా ఆయనకు ఎమ్మెల్యే స్వీట్స్



తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాష, మండల యూత్ నాయకులు చింతలపూడి బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక గీతా భవన్ రోడ్ లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీకష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సభ్యులు ఉప్పల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఉప్పల ప్రజ్ఞతే బాబు సహకారంతో విద్యార్థులకు స్టేషనరీ అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యుడు కిలారపు రంగ ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని పలువురు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, సభ్యుడు బొగ్గరపు తిరపతయ్య, మాకుల సత్యం, నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: భారత మొదటి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఆర్థిక శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధికి పునాదులు వేశారని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. నెహ్రు 134వ జయంతిని పురస్కరించుకొని అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మంగళవారం గ్రామీణ యువజన వికాస సమితి దివిసీమ బాలానంద సంఘముల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవం వేడుకలలో బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలానంద సంఘం అధ్యక్షులు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బుద్ధ ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం ప్రముఖ కవి గుడిసేవ విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల భారతి బాలల సంగీత సాహిత్య నత్య పరిషత్‌ని ఆవిష్కరించారు. నర్తకి అర్చన నృత్యాలయ వారి ఆధ్వర్యంలో బాల భారతి విజయం సంగీతం సాహిత్యం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కోనపరెడ్డి చంద్రశేఖర్, కొల్లూరి వెంకటేశ్వరరావు, గురుస్వామి, తుర్లపాటి రామ్మోహన్రావు, మండలి రామ్మోహన్రావు, బొప్పన కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజా రక్షణభేరి కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి

ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని కోరుతూ మంగళవారం సిపిఎం నేతలు మండలంలోని యార్లగడ్డ, వెలువోలు, నడకుదురు తదితర గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని గద్దె దించేందుకు ప్రజలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. బిజెపికి మద్దతు పలుకుతున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, మండల కమిటీ సభ్యులు మేడేపల్లి వెంకటేశ్వరరావు, కలపాల దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ప్రజా రక్షణభేరి బహిరంగ సభ జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు కె.రామరాజు కోరారు. మండలంలోని పెద్దఅవుటపల్లి గ్రామం ముస్లింపేటలో కరపత్రాల పంపిణీ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామరాజు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల రీత్యా సిపిఎం ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజా రక్షణభేరి యాత్ర నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాలు రమణ తదితరులు పాల్గొన్నారు.


చల్లపల్లిలో...


ఉంగుటూరులో...

దుర్గగుడి చైర్మన్ రాంబాబుకు పితృ వియోగం


నివాళులర్పిస్తున్న వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తండ్రి కర్నాటి బాబూ రావు (72) గుండె పోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. గుండెల్లో నొప్పిగా వుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్ ప్రాంతం కెఎల్ రావు నగర్ విఎంసి కాలనీలో కర్నాటి బాబూరావు నివాసం వుంటున్నారు. నగరపాలక సంస్థ పీహెచ్‌సీ విభాగంలో పనిచేసి 2015లో పదవీ విరమణ చేసి, విశ్రాంత ఉద్యోగిగా జీవితం గడుపుతున్నారు. ఆయనకు భార్య కర్నాటి సీతామహాలక్ష్మి, కాగా, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు కర్నాటి రాంబాబు దుర్గగుడి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, దుర్గగుడి సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మంగళవారం ఆయన కెఎల్ రావు నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని బాబూరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానుల అశ్రు నయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ


బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలంలోని ఐతవరం గ్రామానికి చెందిన యువకులు సోమవారం కీసరలోని మునేరులో ఈతకు వెళ్లి మతి చెందటంతో పోస్టుమార్టం పూర్తి చేసుకున్న ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు మంగళవారం పరామర్శించారు. ముందుగా చేజర్ల డాని వినీష్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు కలిగిన ముగ్గురు యువకులు మతి చెందటం బాధాకరమన్నారు. కీసర మున్నేరు ప్రమాదకరంగా ఉందని.. ఎవరూ మున్నేరులో స్నానాలకు, ఈతకు వెళ్ళద్దని సూచించారు.

19న ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కానూరులోని స్కాట్‌స్ప్రైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎపి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ - 2023 జరుగుతుందని కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్.ఎం. ఫణికుమార్ తెలిపారు. చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఉదయం కానూరులోని స్కాట్ స్ప్రైన్ స్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ పోటీలు అండర్ -6, అండర్ -8, అండర్ -10, అండర్ -12, అండర్ -14, అండర్ -16 విభాగాలలో ఓపెన్, బాల, బాలికలకు విడి విడిగా పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీలకు సంబంధించిన వివరాలకు 97 00 77 5220 ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

అపోలో షుగర్ క్లినిక్ ప్రారంభం

విజయవాడ : 'వాక్ ఫర్ హెల్త్' కార్యక్రమాన్ని ఫన్ టైమ్స్ క్లబ్ రోడ్‌లో డాక్టర్ కాకాని సరిత నిర్వహించారు. ఈ సందర్భంగా షుగరు వ్యాధిగ్రస్తులకు అత్యాధునిక వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా అపోలో షుగర్ క్లినిక్ టీచర్స్ కాలనీలో ప్రారంభించారని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు అన్నారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ మధుమేహ వ్యాధి చికిత్సలో 13 సంవత్సరాల అనుభవం ఉన్న డాక్టర్ సరిత కాకాని అనేకమందికి చికిత్స అందించి పలు అవార్డులు సొంతం చేసుకున్నారన్నారు. డాక్టర్ సరిత మాట్లాడుతూ తమ క్లినిక్‌లో పూర్తి స్థాయి ఓపి సేవలు, షుగర్, బిపి ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ చౌదరి, సీనియర్ జర్నలిస్ట్ కష్ణాజీ, సిద్దార్థ అకాడెమీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సహకరిస్తే జాతీయ క్రీడలు నిర్వహిస్తాం

ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం


మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో క్రీడలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలంటే జాతీయ క్రీడల నిర్వహణతోనే అది సాధ్యపడుతుందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఎపిఓఎ) అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం పేర్కొన్నారు. జాతీయ క్రీడలు నిర్వహించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల నిధులను ఒలింపిక్ సంఘం ద్వారా మంజూరు చేస్తుందన్నారు. 2027లో జాతీయ క్రీడల నిర్వహణకు అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘంతో (ఎపిఓఎ)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా భారత ఒలింపిక్ సంఘంతో (ఐఓఎ)తో పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల గోవాలో ముగిసిన జాతీయ క్రీడలలో రాష్ట్ర క్రీడాకారులు 11 క్రీడాంశాలలో పాల్గొని ఏడు బంగారు, ఐదు రజత, 15 కాంస్య పతకాలతో కలిపి 27 పతకాలు సాధించి దేశంలోనే 19వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ క్రీడల రాష్ట్ర చెఫ్ డి మిషన్ వైవి శివకుమార్, ఎపిఓఎ సీనియర్ ఉపాధ్యక్షుడు నాదెండ్ల బ్రహ్మాజీరావుతో కలసి పురుషోత్తం విలేకరులతో మాట్లాడారు. జాతీయ క్రీడల నిర్వహణకు రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతితోపాటు కాకినాడ నగరాలలో అవుట్ డోర్, ఇండోర్ స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. ఇందుకోసం సుమారు రూ.5 వేల కోట్ల నిధుల అవరసం ఉందని చెప్పారు. గోవా నేషనల్ గేమ్స్‌కు అతి చిన్న రాష్ట్రమైన మేఘాలయ నుంచి సుమారు 560 మంది క్రీడాకారులు ప్రత్యేకంగా విమానంలో వచ్చారన్నారు. అలాగే మణిపూర్, మహారాష్ట్ర, కేరళ వంటి రాష్ట్రాల జట్లుసైతం విమానాలలో రాగా, ఎపి క్రీడాకారులు రైలు జనరల్ కంపార్ట్‌మెంట్‌లో పోటీలకు హాజరుకావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడమే ఇందుకు కారణమని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు. జాతీయ క్రీడల చీఫ్ డి మిషన్ వైవి శివకుమార్ మాట్లాడుతూ, సరైన కోచింగ్ లేకపోవడంతో రాష్ట్రం 27 పతకాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు.

మున్నేరులో తవ్వకాలపై టిడిపి నిరసన


ఆందోళన చేస్తున్న సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలంలోని రాఘవాపురం గట్టులో సోమవారం అర్ధరాత్రి అధికార పార్టీ నేతలు కొనసాగిస్తున్న అక్రమ గ్రావెలింగ్‌ను గట్టు వద్ద టిడిపి నాయకులు అడ్డుకున్నారు. అధికారులు వెంటనే స్పందించాలంటూ డిమాండ్ చేశారు. అర్ధరాత్రి సమయాన్ని కూడా లెక్కచేయకుండా గట్టు వద్ద మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య బైఠాయించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ కీసరలో అత్యంత దురదష్టకరమైన సంఘటన జరిగి కొన్ని గంటలు గడవకుండానే అధికార పార్టీ నేతలు కనీస మానవతా దకృథం కూడా లేకుండా అక్రమ గ్రావెల్ ను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. పెద్ద పెద్ద మిషన్లు జెసిబిలతో రాఘవపురం గట్టును అర్ధరాత్రి సమయంలో యదేచ్ఛగా కొట్టుకొని వెళ్ళిపోతున్నారని తెలిపారు. దీనిపై నందిగామ ప్రజానీకానికి ఏ విధంగా సమాధానం చెబుతారో బహిరంగంగా తెలియపరిచాలన్నారు. అధికారులు వెంటనే గట్టు వద్దకు రావాలని, అక్రమ గ్రావెలింగ్ చేస్తున్న వాహనాలను వెంటనే స్వాధీన పరచుకోని శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడే నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జామున ఎస్సై పండు ద్వారా శాఖపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలతో సంబంధం లేదు : ఎంఎల్ఎ, ఎంఎల్‌సి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మొండితోక జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి - నందిగామ : 'ఇసుక అక్రమ త్రవ్వకాలకు, గ్రావెల్ అక్రమ త్రవ్వకాలకు మాకు ఎటువంటి సంబంధం లేదని మళ్లీ, మళ్లీ చెబుతున్నాం, సత్యమ్మ తల్లి ఆలయంలోనే కాదు, మీరు ఏ భగవంతుడిని నమ్మితే అక్కడ వెంకటేశ్వర స్వామి ఆలయం అయినా, అల్లాః సాక్షిగా అయిన, ఏసుక్రీస్తు సాక్షిగా అయిన ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధం' అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌లు దేవినేని ఉమాకు సవాల్ విసిరారు. నందిగామ పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పాత్రికేయులు సమావేశంలో వారు మాట్లాడుతూ మమ్మల్ని మీరు వసూలు బ్రదర్స్ అని అన్నారు.. మేము ఎక్కడ వసూలు చేసామో ఏం అక్రమాలు చేసామో నిరూపించగలరా అని ప్రశ్నించారు. నందిగామలో గ్రావెల్ అక్రమ త్రవ్వకాలు, ఇసుక అక్రమ తవ్వకాలు ప్రారంభించింది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. నందిగామలో డివిఆర్ కాలనీలో, శివాలయం భూముల్లో మీరు అక్రమంగా త్రవ్విన త్రవ్వకాలు నేటికీ సజీవ సాక్ష్యం గానే ఉన్నాయన్నారు. రాఘవాపురం గట్టులో తెలుగుదేశం పార్టీ వారే అక్రమంగా గ్రావెల్ తవ్వకుంటుంటే తెలుగుదేశం పార్టీ వారే వెళ్లి నిద్రలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నందిగామ ఎ ఎం సి చైర్మన్ మస్తాన్, నెలకుదిటి శివ నాగేశ్వరరావు , దేవేందర్ రెడ్డి, బొల్లినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - మైలవరం : పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలను వెంటనే విడుదల చేయాలని సిఆర్పి యూనియన్ జిల్లా అధ్యక్షులు బుద్ధారపు గోపాలరావు మంగళ వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలు రాకపోవడంతో సిఆర్పిల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. ఉన్నతాధి కారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ప్రయోజనం లేదన్నారు. వెంటనే జీతాలు విడుదల చేయకపోతే ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎస్ ఎస్సి ఎంప్లాయిస్ జేఏసీ నాయకుడు సాయి రమేష్ ఉన్నారు.

చిన్నారికి ఎంపి అన్నప్రాసన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం చందాపురం గ్రామంలో అడ్వకేట్ ఎక్కిరాల హనుమంతరావు కుమారుడి అన్నప్రాసన వేడుకలో విజయవాడ ఎంపి కేశినేని నాని పాల్గొన్నారు. చిన్నారిని శాసనమండలి సభ్యులుమొండితోక అరుణ్‌కుమార్ ఆశీర్వదించారు.

16న రగ్బీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 16న కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 రగ్బీ జట్టు ఎంపికలకు సంబంధించిన పోటీలు నగరంలోని మేరిస్ స్టెల్లా కళాశాలలో నిర్వహించనున్నట్లు కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ కార్యదర్శి వి.రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు కళాశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. 1.1.2005 తరువాత పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారంతా తమ పదవ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్, ప్రస్తుతం చదువుతున్న విద్యా సంస్థకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. వివరాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫీస్‌లో సంప్రదించాలని కోరారు.

వైఎస్ఆర్ బీమా మంజూరు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని 2 వార్డు అశోక్‌నగర్‌కు చెందిన బేరోతుల ఆదినారాయణ గత 2 నెలల క్రితం ప్రమాదవశాత్తు మతి చెందటంతో వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన రూ.5 లక్షల నగదును శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎఎంసి చైర్మన్ మస్తాన్, వైసిపి నందిగామ కన్వీనర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

17న బస్సుయాత్ర

నందిగామ : ఈ నెల 17న సాయంత్రం సామాజిక బస్సు యాత్ర, నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ పేర్కొన్నారు. గాంధీ సెంటర్‌లో సభ ఏర్పాట్లను ఎంఎల్సి పరిశీలించారు.

నేడు సిపిఎం బహిరంగ సభకు తరలిరండి

విజయవాడ : సింగ్‌నగర్ యంబి స్టేడియంలో బుధవారం జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యలో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో మంగళవారం ఉదయం వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళా బృందాల ద్వారా ప్రచారం జరిగింది. ప్రధాన రహదారి పక్కన బ్యానర్ చేబూని, వచ్చిపోయే వారికి కరపత్రాలు పంపిణీ చేస్తూ, సభకు ఆహ్వా నం పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు. **విస్సన్నపేట:** నేడు జరగనున్న ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి. బివి.రాఘవులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పాల్గొంటారని సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. **వన్‌టౌన్ :** ప్రజా రక్షణ భేరి జయప్రదం చేయాలని 50వ డివిజన్ కార్పొరేటర్, సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బోయి సత్యబాబు పిలుపు నిచ్చారు. మంగళవారం వన్‌టౌన్ గాంధీ పార్కు వద్ద స్థానికులతో బోయి సత్యబాబు సమావేశం నిర్వహించారు. **విజయవాడ :** ప్రజారక్షణ భేరిలో పాల్గొని సభను జయప్రదం చేయాలని మొగల్రాజపురం కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. తూర్పు సిటీ ప్రధాన కార్యదర్శి బెనర్జీ, స్థానిక నాయకులు, సిపిఎం నాయకులు మురహరి పాల్గొన్నారు.



విజయవాడలో...



మొగల్రాజపురంలో...


విస్సన్నపేటలో...


వన్‌టౌన్‌లో...

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు


గుడివాడలో...


గుడ్లవల్లేరులో...


చల్లపల్లిలో...


హనుమాన్‌జంక్షన్‌లో...


మొవ్వలో...


పెదపారుపూడిలో...

కృష్ణాజిల్లాలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

కృష్ణాజిల్లాలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించేది గ్రంథాలయాలేనని ప్రతిఒక్కరూ పుస్తకపఠనం అలవరచుకోవాలని అన్నారు. గ్రంథాలయాలు ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమం నుండి నేటి వరకు అందరికీ ఉపయోగపడుతున్నాయన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లి చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం: స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి అనగాని రవి వారోత్సవాలు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పుణ్యఛారిటీస్ కార్యదర్శి, రోటరీ క్లబ్ అధ్యక్షులు జేవీబీ కుమార్, గన్నె వెంకట్రావు, చిమట రామారావు, గ్రంథాలయ ఇన్చార్జి డి.బాబూరావు పాల్గొన్నారు. గన్నవరం శాఖ గ్రంథాలయంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పిటిసి ఏఈ రాణి, గ్రంథాలయ అభివద్ధి కమిటీ చైర్మన్ సీతారామారావు పాల్గొని డిపాజిట్ కట్టి ఓ పుస్తకాన్ని తీసుకున్నారు. **గుడ్లవల్లేరు:** స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను ఎంపీడీవో దారపు శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్, దేశభక్తి గేయాలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మెరుగుమాల పూర్ణ కవిత, ఎంఈఓ జగన్మోహన్రావు, పంచాయతీ కార్యదర్శి ఏజేయల్ నరసింహారావు, గ్రంథాలయ అధికారిని టి.వాణి పాల్గొన్నారు. **ఉంగుటూరు:** ఉంగుటూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కె.వరప్రసాద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు రన్నింగ్, గుణింతాలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఉప్పలపాటి చంద్రశేఖరరావు పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్:** వీరవల్లి గ్రంథాలయంలో వారోత్సవాలను ఎంఈఓ బి.సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి, సర్పంచ్ పిల్లా అనిత, హెచ్ఎం ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** చల్లపల్లి శాఖ గ్రంథాలయంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.గణేష్ కుమార్ పాల్గొన్నారు. **పెదపారుపూడి:** వెంట్రప్రగడ శాఖా గ్రంథాలయంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె హరికిషోర్ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చప్పిడి సమీరా, వైస్ ఎంపీపీ రజిని, సిహెచ్ కిషోర్, గ్రంథాలయ అధికారిని ఎంవీఎస్ లక్ష్మి, యలమర్రు బ్యాంక్ మేనేజర్ హేమంత్ పాల్గొన్నారు. **మొవ్వ:** మొవ్వ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి టి.కృష్ణకుమారి పర్యవేక్షణలో సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఒకటి నుండి మూడో తరగతి చదువుతున్న విద్యార్థులకు, అంగన్వాడీ చిన్నారులకు విచిత్ర వేష ధారణ అంశంలో పోటీ నిర్వహించారు. ఈ **తోట్లవల్లూరు:** గ్రంథాలయ శాఖ అధికారి బాబురావు ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభించడం జరిగింది. గ్రామ సర్పంచి పెనుమత్స రాధిక, ఎంపీడీవో స్వర్ణ లత, కార్యదర్శి పుష్పనాథం పాల్గొన్నారు. **గుడివాడ:** షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మున్సిపల్ కమిషనర్ వి మురళీకృష్ణ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో తెలుగు భాష వికాస సమితి సమన్వయకర్త డిఆర్బి ప్రసాద్, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, సభ్యులు అవిర్నేని వెంకటేశ్వరరావు, ఉరిటి రామారావు పాల్గొన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బి శాంతి, జోగా నాగేశ్వరరావు, దుడ్డు చిన్న, అర్జ ప్రసాద్, కోన రామారావు, అట్లూరి తిరుమలరావు, అవేర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో...


ఉంగుటూరులో...




పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-చల్లపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు సూపర్‌వైజర్ తోట సుధాకర్ తెలిపారు. మంగళవారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి చల్లపల్లి, మోపిదేవి మండలాల నుంచి 13 మంది వృద్ధులను పెద్దకాకాని ఆసుపత్రికి బస్సులో తరలించారు. నాలుగో విడత 13 మంది ఆపరేషన్లకు వెళుతుండగా, మొత్తం ఈ పథకం ద్వారా చల్లపల్లి మండలం నుంచి 47 మంది, మోపిదేవి నుంచి 52 మంది ఉచిత ఆపరేషన్లకు ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నందం బాబూరావు, సిహెచ్ఓ సుమతి, ఎంఎల్‌హెచ్‌పి సిద్ధాబత్తుల నీలిమ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కంకిపాడు: కాసరనేనివారిపాలెం గ్రామంలో ప్రమాదానికి గురై గాయాలపాలయిన చోడవరపు సీతారాం భార్య విజయలక్ష్మికి, కంద్రు ఏసుబాబు తండ్రి యాకోబుకి రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు, పాలు, గుడ్లు, కూరగాయలు, పండ్లు దేవినేని ఆర్మీ లయన్, ఇంజనీర్ రావి సురేష్‌బాబు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ 26 సంవత్సరాలు ప్రజాసేవ తనకి ఎంతో సంతృప్తి ఇచ్చిందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 120 గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు, మొక్కలు నాటడం, పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేయడం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పెద్ది ప్రసాద్, ఇరుకులపాటి బాబురాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు, మొవ్వ నాగభూషణం, రావి అప్పారావు, రావి సాంబశివరావు, రావి రాజేష్ పాల్గొన్నారు.



ఖోఖో అంతర్ జిల్లాల జట్లు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం: ఉత్సాహంగా కృష్ణా జిల్లా ఖో ఖో సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కష్ణా జిల్లా అండర్ 14 బాల బాలికల జట్ల ఎంపిక గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు మడక వెంకట ప్రసాద్, మద్దినేని సత్య ప్రసాదు మాట్లాడుతూ పారదర్శకంగా ప్రతిభ గల క్రీడా కారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. గన్నవరం విశ్వభారతి సైనిక పాఠశాల కరెస్పాండెంట్ ఎస్ డి లాల్ క్రీడాకారులకు ఉచిత భోజనం ఏర్పాటు చేయగా పెద్ద ఆవుటపల్లి శ్రీ సాయి స్కూల్ కరెస్పాండెన్ట్ సాయి పతకాలను బహుకరించారు. కాగా తేలుత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఝాన్సీ ఎంపిక కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖో ఖో సంఘము కోశాధికారి రామారావు గన్నవరం, గొల్లనపల్లి నిడమానూరు, పెద్ద ఆవుటపల్లి,వీరవల్లి వ్యాయామ విద్య ఉపాధ్యాయులు గీత, వెంకటేశ్వరరావు, గౌసాని, రాంబాబు, లక్ష్మణరావు హాజరయ్యారు.



'చిరుమువ్వలు' ఆవిష్కరణ

ప్రజాశక్తి-చల్లపల్లి

బాలల దినోత్సవ సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన పిల్లల ప్రత్యేక సంచిక 'చిరుమువ్వలు'ను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ పరసా వెంకటేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.అనిల్, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు.



నాడునేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల

నాడునేడు పనుల ద్వారా అమినాపురం పాఠశాల అభివృద్ధికి పనులు జరుగుతున్నాయని సర్పంచ్ కలపాల రాంబాబు తెలిపారు. మంగళవారం అమినాపురం ఉన్నత పాఠశాలలో నాడునేడు పనులను ఆయన పరిశీలించారు. రూ.11 లక్షల రూపాయలతో జరిగే పనులు జరుగుతున్నాయని చెపాపరు. దాత వంగవరపు శారద ఆధ్వర్యంలో నూతనంగా ఒక భవన నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు హనుమంతపురంలో సచివాలయ నిర్మాణం, రైతు భరోసా కేంద్రం పనులు తుదిదశకు వచ్చాయని తెలిపారు.



వాసుదేవ ఆచార్యకు ఎల్‌ఐసి ఏజెంట్ల నివాళి

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, జీవిత బీమా ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి వాసుదేవ ఆచార్య కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. ఎల్‌ఐసి ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసిఎఓఐ) వ్యవస్థాపక అధ్యక్షులు, సిఐటియు ఆలిండియా నాయకులు వాసుదేవ ఆచార్య సంతాప సభ ఎల్‌ఐసి మచిలీపట్నం డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్‌ఐసిఎఓఐ మచిలీపట్నం డివిజన్ కార్యదర్శి కె.రాజారావు అధ్యక్షతన జరిగిన 11 పర్యాయాలు పార్లమెంట్‌కు ఎన్నికైన వాసుదేవ ఆచార్య కార్మికులు, ఎల్‌ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని వక్తలు అన్నారు. ఈ సభలో ఎల్‌ఐసి ఎంప్లాయిస్ , ఐసిఇయు నాయకులు సుధాకర్, రాజశేఖర్, 683 బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు, ఎబిఎం శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు రత్నారావు, సిఐటియు నాయకులు బి.సుబ్రహ్మణ్యం, జయరావు, ఎల్‌ఐసిఎఓఐ బ్రాంచి అధ్యక్షులు గుప్తా, కార్యదర్శి భాస్కర్, నాయకులు మామిడి ప్రభాకర్, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొని సంతాపం సందేశాలు తెలిపారు.


వాసుదేవ ఆచార్యకు నివాళులర్పిస్తున్న ఎల్‌ఐసి సిబ్బంది

మహిళలకు ప్రత్యేకం...పింక్ టాయిలెట్లు : కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం బెంజిసర్కిల్ జంక్షన్‌లో నిర్మాణం పూర్తిచేసుకున్న పింక్ టాయిలెట్స్ (స్త్రీ లకు ప్రత్యేకమైన టాయిలెట్) క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ టాయిలెట్లలో ఏర్పాటు చేసిన



తల్లులు తమ బిడ్డలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదిని, శానిటరీ న్యాప్కిన్స్ కోసం వెండింగ్ మిషన్‌ను, ప్రయాణాలు చేసే వారు ముఖం కడుక్కుని, ఫ్రెష్ అవ్వడానికి ప్రత్యేక సదుపాయాలు, బాత్ రూమ్స్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమీషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరెన్ రాయ్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

జీవన వికాసానికి సోపానాలు గ్రంథాలయాలు : కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజల జీవన వికాసానికి, సమాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తున్నాయని కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాల వారోత్సవ సందర్భంగా గన్నవరుపేటలోని ఠాగూర్ స్మారక జిల్లా గ్రంథాలయంలో మంగళవారం ఆయన గ్రంథాలయ వారోత్సవాలను జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయ విశిష్ఠతను నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసేలా ప్రతిజ్ఞ చేయాలని అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలాపూర్ణమ్మ మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని



జిల్లావ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రముఖ సాహితి వ్యక్త జి.వి.పూర్ణచందు, స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, గ్రంథాలయ కార్యదర్శి నగేష్, గ్రంథపాలకులు కె.రమాదేవి తదతరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి : జెసి

ప్రజాశక్తి - విజయవాడ : అసైన్డ్ భూములపై పూర్తిస్థాయిలో యాజమాన్య హక్కులు కల్పించేందుకు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల కల్పనలో తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ఆయన...సబ్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి తిరువూరు, నందిగామ ఆర్‌డిఒలు, అన్ని మండలాల తహాశీల్దార్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 20 ఏళ్ల ముందు పట్టాలు పొందిన వ్యవసాయ భూములకు యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు వివరించారు. ఈనేపథ్యంలో లబ్ధిదారుల జాబితా రూపకల్పనకు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. విఆర్‌ఒలు, తహాశీల్దార్లతో జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయ భూములు, లబ్ధిదారుల వివరాలతో పూర్తిస్థాయిలో నివేదికలు సమర్పించాలన్నారు. 22 ఏ కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈసమావేశంలో నందిగామ ఆర్‌డిఒ పి.సాయిబాబు, తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.



నగరం ముస్తాబు

(మొదటి పేజీ తరువాయి)

ఎర్రబారాయి. పైపుల రోడ్డు, ప్రకాష్‌నగర్, కండ్రిక, వాంబేకాలనీ, మధురానగర్, సత్యనారాయణపురం, గవర్నర్‌పేట, ఏలూరు లాకుల సెంటర్, మ్యాంగోమార్కెట్, లెనిన్ సెంటర్, రామవరప్పాడు రింగ్, సీతన్నపేట సికె రెడ్డి రోడ్డు, జింఖానా గ్రౌండ్స్ వద్ద జిఎస్ రాజురోడ్డు, పోలీసు కంట్రోల్ రూమ్, కృష్ణలంక జాతీయ రహదారి, బందరు లాకుల వద్ద ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, తోరణాలు, బ్యానర్లను సభకు ఆహ్వానం పలుకుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇందుకోసం గత రెండు వారాల నుంచి వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా పని చేశారు. స్టేడియంలో సభా వేదికను 30 ఇంటు 56 అడుగుల వైశాల్యంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. వేదికపై భారీ స్థాయిలో బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఎండకు, వర్షానికి సైతం ఇబ్బంది లేనిరీతిలో స్టేడియంలో భారీ టెంట్లను, కుర్చీలను వేశారు. రాష్ట్రం నలుమూలల నుండి ప్రజలను తీసుకువచ్చే వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. ఎక్కడికక్కడ సూచికలు ఉంచారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సి హెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, తదితరులు సభావేదిక, ప్రదర్శన ఏర్పాట్లను మంగళవారం పర్యవేక్షించారు. ఎక్కడా ఎటువంటి అంతరాయం కలగకుండా స్టేడియం లోపల, చుట్టుపక్కల కూడా నాయకుల ప్రసంగాలను వినడానికి వీలుగా మైక్ సిస్టం ఏర్పాట్లు చేశారు.

విస్తృత ప్రచారం పూర్తి

ఈ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, అభ్యదయ వాదులు, ప్రజాస్వామిక వాదులు, వామపక్ష వాదులను తరలించి విజయవంతం చేసేందుకు సిపిఎం శ్రేణులు తీవ్రంగా శ్రమించాయి. ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు వీధి వీధికి, ఇంటింటికీ 75 వేల కరపత్రాలను పంపిణీ చేస్తూ మైక్ ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించారు. గ్రూపు సమావేశాలు, బైక్, స్కూటర్ ర్యాలీల ద్వారా కూడా ప్రచారం జరిగింది. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లలో సభలు, సమావేశాలు నిర్వహించారు. సింగ్‌నగర్లో ఐద్వా ఆధ్వర్యాన ఇంటింటికీ బొట్టు పెట్టి మరీ ప్రత్యేకంగా ప్రజలను ఆహ్వానించారు. కళాజాతాల ద్వారా పాటలు పాడుతూ, విచిత్ర వేషాలు ప్రదర్శిస్తూ సభ ప్రాధాన్యతను వివరించారు. ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు, కళాకారులు జగన్, పిఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు నేతృత్వంలో 25 మందితో కూడిన రెండు కళా బృందాలు ప్రచారం నిర్వహించాయి. నగరంలో కళా జాతాల ద్వారా ప్రచారం జరిగింది. కళాకారులు ఆట-పాటల ద్వారా ప్రజల్లోకి వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 30, నవంబరు 2వ తేదీన ప్రారంభమైన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రలు ఈనెల 8, 9, 10 తేదీల్లో విజయవాడ చేరిన విషయం తెలిసిందే.

టీచర్ల కొరతపై ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఏమి చెప్పాలి. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలకు తాళాలు వేస్తారా? సమస్య పరిష్కారం అవుతుందో లేదో చెప్పాలి' అని ఏలూరు, కృష్ణాజిల్లాల డిఇవోలను కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలలో చదవించమంటారా...? ప్రయివేటు పాఠశాలకు పిల్లలను పంపమంటారా? అని విద్యార్థుల తల్లిదండ్రులు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. ఈ తొలుత సమస్యపై కలిదిండి ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమ మండలంలో 31 మంది టీచర్ల కొరత ఉందని, నియోజకర్గంలో మొత్తం 200 మంది వరకు కొరత ఉందన్నారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నా టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో సిలబస్ బోధించే వారు లేకుండా పోయారన్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేయడంతోనే సమస్య ఏర్పడిందన్నారు. పర్మినెంట్ పోస్టులు కేటాయించిన పాఠశాలల్లో బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో మరొకరిని నియమిస్తేనే సదరు ఉపాధ్యాయుడిని రిలీవ్ చేయాలని మార్గదర్శకాలు చెబుతున్నాయని తెలిపారు. ఈ మార్గదర్శకాలను పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు బదిలీలు చేపట్టడంతోనే గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో టీచర్ల కొరత తీవ్రమైందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సమీప పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు వారంరోజుల్లో బోధనా బాధ్యతలు అప్పగించి సిలబస్ పూర్తి చేయిస్తామని కృష్ణా, ఏలూరు జిల్లాల డిఇఒలు తెలిపారు. మరికొన్ని మండలాలకు చెందిన జడ్‌పిటిసిలు, ఎంపిపిలు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి విద్యావాలంటీర్లను నియమించాలని, కొన్ని పాఠశాలల్లో నాడు- నేడు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని, సమగ్రశిక్ష పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు..

కరువు మండలాలుగా ప్రకటించండి

వర్షాభావ పరిస్థితుల కారణంగా జగ్గయపేట, నందిగామ నియోజకవర్గాలు, గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, చాట్రాయి, ముసునూరు తదితర మండలాల్లో వివిధ రకాల పంటలు ఎండిపోయాయని ఆయా మండలాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. తద్వారా రైతులకు నష్టపరిహారం, బీమా అందేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్ వరకు నమోదైన వర్షపాతం ఆధారంగానే కరువు మండలాలను ప్రకటించారని, అక్టోబర్, నవంబర్లలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు ఎండాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎండిన పంటలకు నష్టపరిహారం, బీమా ఇప్పించాలని కోరారు.

ఏలూరు కలెక్టర్‌పై పేర్ని ఆగ్రహం

"జడ్‌పి సమావేశానికి జాయింట్ కలెక్టర్‌ను పంపాను.. సమావేశానికి నేను రాను...మా అధికారులెవరూ రారు" అని చెపుతున్నట్లుగా ఏలూరు జిల్లా కలెక్టర్ వ్యవహారశైలి ఉందని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో ఏలూరుకు చెందిన ఎస్ఇ మరో రెండు జిల్లాలకు ఇన్‌చార్జిగా ఉన్నా సమావేశానికి గైర్హాజరయ్యారని, ఇఇ, డిఇ స్తాయి అధికారులు మాత్రమే హాజరయ్యారని పేర్ని అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఇ గురించి ఆరా తీశారు. ఏలూరు జిల్లాలో కలెక్టర్ ఇరిగేషన్ ఎడ్వయిజరీ బోర్డు సమావేశం నిర్వహించడంతో కొందరు అధికారులు రాలేకపోయారని ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ, ఇఇలు సమాధానం ఇవ్వడంతో పేర్ని ఈ వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి రాని అధికారులతో త్వరితగతిన మరోసారి సమీక్ష నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికకు సూచించారు. పాఠశాలల్లో విద్యావాలంటీర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం వెంటనే మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉండదని, ఈనేపథ్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద జిల్లాల్లోని ప్రముఖ సంస్థల ద్వారా విద్యావాలంటీర్లను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోడ్ల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.21 కోట్లు, తాగునీటి సరఫరాకు రూ.42 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. జడ్పీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని, అధికారులు ఇస్తున్న వివరణ చూస్తుంటే 9 శాతం పేద విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించారని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో చట్టం ప్రకారం పూర్తి స్థాయిలో పేద విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చేరేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారంలో పురోగతిపై వచ్చే సమావేశాల్లో వివరణ ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్‌లు పి.రాజాబాబు, ఎస్.డిల్లీరావు, ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, అవనిగడ్డ ఎంఎల్‌ఏ సింహాద్రి రమేష్‌బాబు, జడ్పీ సిఇవో వి.జ్యోతిబాసు తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన రోడ్డుకు నిధులు

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు శ్మశాన వాటికకు దారి ఏర్పాటు నిమిత్తం రూ.3 లక్షలు కేటాయించి అభివృద్ధి చేయడంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ కృషి అభినందనీయమని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండలంలోని నాగవరపాడు గ్రామంలో శ్మశానానికి సరైన దారి లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందిని సర్పంచ్ షేక్ పెదనాగూర్ వంశీ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన నిధులు కేటాయించి రోడ్డును అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



వాలీవాట్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు పులిగడ్డ గురుకుల పాఠశాల 8వ తరగతి విద్యార్థి జి మోహన్ సంజయ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ టి పి కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆ విద్యార్థిని మంగళవారం పాఠశాల వద్ద అభినందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీలలో విశాఖపట్నం మన్యం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కష్ణా జిల్లా తరపున పాల్గొన్న మోహన్ సంజయ్ అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పిఈటి వీర కుమార్ ప్రిన్సిపాల్ అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుడివాడ: కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు అండ్ కార్పొరేట్ స్కూలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి రాత్రి 7:30 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించడం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం అన్నారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ మంగళవారం ఉయ్యూరులో ఉన్న అన్ని ప్రైవేటు, అన్ని కార్పొరేట్ స్కూళ్లల్లో 7:30 గంటల వరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమయంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ నిర్వహించడం అనేది విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నిస్తున్నామన్నారు. చైతన్య యాజమాన్య వాళ్ళు విద్యాశాఖ అధికారులపై దాడికి ప్రయత్నించడం, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం, విద్యాశాఖ వారికి తొత్తులుగా ఉండటం ప్రథమ కారణమని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గా మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. కానీ ఇక్కడ విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ అండ్ ప్రైవేట్ సెక్టార్లకి తొత్తులుగా వ్యవహరించి వాళ్ళకి మద్దతు ఇవ్వడం జరుగుతుందని, వాళ్ల మద్దతు ఉంది



అని ప్రైవేటు కార్పొరేట్ సెక్టార్లు సాయంత్రం ఏడున్నర వరకు క్లాసులు నిర్వహించటానికి అనుమతులు ఇచ్చారని ఒక ప్రైవేట్ సెక్టార్లు చెప్పడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా కష్ణా జిల్లా విద్యాశాఖ స్పందించి నిబంధనలు ఉల్లంఘించి క్లాసులు నిర్వహిస్తున్న చైతన్య, నారాయణ, రవీంద్రభారతి వంటి ప్రైవేట్ అండ్ కార్పొరేట్ స్కూల్స్ యొక్క గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు సలీం ప్రేమ్ పాల్గొన్నారు.

వాడీవేడిగా తోట్లవల్లూరు మండల సమావేశం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఈడుపుగంటి రాజమణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. అధికార వైసీపీ పార్టీ సర్పంచులే సభలో ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు సంధించారు. తోట్లవల్లూరు గ్రామ సర్పంచ్ పెనుమత్స రాధిక తాము సర్పంచిగా ప్రమాణస్వీకారం చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదని



దీనికి కావాల్సిన మందును అధికారులను అడిగితే ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది చేతివాటం వలన దళితుల పేరున వచ్చిన విద్యుత్ మీటర్లు ఉన్నత వర్గాల కుటుంబాలలో అమర్చడం జరిగిందని అన్నారు. అర్హుడైన దళితుడికి కళ్యాణమస్తు పథకం వర్తింప చేయకుండా మండల ఎంపీడీవో టి స్వర్ణలత అడ్డు పడుతున్నారని, సచివాలయంలో ఉన్న వాలంటీర్లు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు కూడా తమ మాట వినడం లేదని, సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు సేవ చేయలేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరు వల్ల నిజమైన లబ్ధిదారులకు కూడా న్యాయం చేయలేకపోతున్నామన్నారు. వల్లూరు పాలెంలో ఎంపీటీసీ కాసర్నేని అనురాధ తమ గ్రామంలోని ప్రజలురూ.600 వచ్చే కరెంటు బిల్లు రూ.16000 వరకు రావడం పై తమ దష్టికి తీసుకువచ్చారని. కనకవల్లి సర్పంచి పివిఎన్ శర్మ సాగింగ్ చేయడానికి అవసరమైన మందును అధికారులు రాసి ఇస్తే తమ సొంత ఖర్చులతో గ్రామంలో ఫాగింగ్ చేయించుకుంటామని మాట్లాడారు.బొడ్డపాడు గ్రామంలో పాఠశాలలో విద్యార్థులకు మంచినీరు సౌకర్యం లేదని సర్పంచి మూడే శివశంకర్ అన్నారు. సమావేశంలో జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి,ఎంపీడీవో టి స్వర్ణలత, తహశీల్దారు ఎం కుసుమకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై నిరసన

ప్రజాశక్తి-ఘంటసాల: రాష్ట్ర ప్రభుత్వం అధికంగా పెంచిన విద్యుత్ ఛార్జీల కారణంగా సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని టిడిపి, జనసేన నాయకులు పేర్కొన్నారు. ఘంటసాల బ్యాంకు సెంటర్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాన్ని ప్రభుత్వం మోపుతుందని విమర్శించారు. తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, మోపిదేవి, అవనిగడ్డ మండలాల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ సభ్యులు సిద్ధినేని కుమార్‌రాజా, టిడిపి నాయకులు బండి పరాత్మరరావు, కాకుమాని రంగారావు, తాతినేని కృష్ణారావు పాల్గొన్నారు.



వినూత్న హస్తకళల ఉత్పత్తులతోనే ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: హస్తకళల్లో వినూత్న ఉత్పత్తులతోనే స్థిరమైన ఆర్థికాభివద్ధికి సాధ్యమని హస్తకళాసేవా కేంద్రం రీజినల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆపర్ణలక్ష్మి సూచించారు. వీరవల్లి శాలివాహనకాలనీలో కేంద్ర



జౌలిమంత్రిత్వశాఖ మరియు హస్తకళాకేంద్రం విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హస్తకళాకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాలివాహన కాలనీలో మట్టితో తయారు చేసిన ఉత్పత్తులను, తయారీ, విదానాన్ని క్షేత్రస్థాయిలో అపర్ణలక్ష్మి పరిశీలించారు.హస్తకళాకారులకు కేంద్రప్రభుత్వం తరపున గుర్తింపుకార్డులు జారీచేయడు, ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడంతో పాటు వినూత్న ఉత్పతుల తయారీకి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. పర్యావరణహిత ఉత్పతులపై ప్రజలకు ఆసక్తి పెరిగిందని, వినూత్నమైన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మాత్రమే హస్తకళాకారుల అర్థికాభివద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ పీడీ సుధీర్ కుమార్, శాలివాహన సంఘ అధ్యక్షుడు సుంకర రంగారావు, కోశాధికారి రాజరపు బలరామయ్య, యర్రారపు శేషగిరిరావు, యినగంటి వెంకటేశ్వరరావు, కాసూళ్ల శివనాగేశ్వరరావు, వీరయ్య, శ్రీనివాసరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రజక ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఈనెల 26వ తేదీన నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా జరుగుతున్న రజక ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయాలని జై భీమ్ భారత పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సముద్రాల అంబేద్కర్ కోరారు. మంగళవారం సీతా లంక అంబేద్కర్ విగ్రహం ఎదుట ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే చెప్పినట్లుగా దేహానికి రక్తనాళాలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో ఈ దేశంలో ఉత్పత్తి కులాలు దేశ సంపద అభివద్ధికి బీసీలు కూడా సమాజ అభివద్ధికి ఉపయోగపడుతున్నారని తెలిపారు. దేశంలో బడుగులు బలహీన వర్గాల వారు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివద్ధి సాధించాలనే లక్ష్యంతో జడ శ్రవణ్ కుమార్ జై భీమ్ భారత పార్టీని స్థాపించారని తెలిపారు. అందులో భాగంగానే 26న జరిగే రరక ఆత్మ గౌరవ మహాసభను విజయవంతం చేసేందుకు పిలుపునిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంట్రుప్రగడ వెంకటేశ్వరరావు, పులిగడ్డ వెంకటేశ్వరరావు, పులిగడ్డ గోపి, హనుమంతు, కృష్ణ పాల్గొన్నారు.

ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామంలో సర్పంచ్ అనూష ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వము వైఎస్ఆర్ కంటి వెలుగు పదకము ద్వారా అందిస్తున్న ఉచిత కళ్ళ జోడు పంపిణీ కర్యక్రమం సచివాలయం వద్ద మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గడిదేశి రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జానకి లక్ష్మి పాల్గొన్నారు.

టిడ్కో రుణాలపై కొడాలి స్పందించాలి : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ: టిడ్కో గృహాల విషయంలో లబ్ధిదారులు తీసుకున్న రుణాలు ఎప్పటి నుండి బ్యాంకులకు కట్టాలో తెలియక కొన్నిచోట్ల బ్యాంకులు గహాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసులు వస్తున్నాయని వీటి విషయంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని క్లారిటీ ఇవ్వాలని టిడిపి నాయకులు వెనిగండ్ల రాము ప్రశ్నించారు. రాజేందర్ నగర్ లోని తన స్వగహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రంగులు మార్చడానికి నాలుగు సంవత్సరాలు, విగ్రహాలు పెట్టుకోవడానికి ఆరు నెలలు కేటాయించడం జరిగిందన్నారు. టిడ్కో గృహాలకు కనీస అవసరమైన నీరు, డ్రైనేజీ వ్యవస్థలు కూడా ఏర్పాటు చేయకుండా గృహాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ కైలే సుబ్బారావు, నాయకులు షేక్ ఇబ్రహీం, గడ్డం ప్రకాష్ దాస్, సాంబయ్య, బొంబాయి శ్రీను, ఏసు పాదం, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

16న కులగణనపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈనెల 16వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మచిలీపట్నం జడ్పీ కన్వెన్షన్ హాల్లో కులగణనపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు నేతత్వంలో జరుగుతుందన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-గన్నవరం: ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గన్నవరం సచివాలయం-2లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందిన వివరాలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీపీ అనగాని రవి, నాయకులు నీలం ప్రవీణ్ కుమార్, జడ్పీటిసి సబ్యులు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలు అందరికీ చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కార్యదర్శి చావల అనిల్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందర్రావు, వైసిపి నాయకులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని కవుతరం గ్రామ సచివాలయం వద్ద 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందిన వారి వివరాలతో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్, గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ శాయన రవికుమార్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్, తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్ పాల్గొన్నారు. **మోపిదేవి:** మోపిదేవి మండల పరిధిలోని కే కొత్తపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద ఎండిఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలపై పలువురు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నోడల్ అధికారి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మత్తి లత, సనకా వెంకట రాజేష్ బాబు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), పిఏసిఎస్ చైర్ పర్సన్ తుటారం కష్ణ, ఆది రాంబాబు పాల్గొన్నారు. **పెదపారుపూడి:** పెదపారుపూడి సచివాలయం వద్ద పార్టీ జెండాను వైస్ ఎంపీపీ రజిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులకు ఎంత మేరకు సంక్షేమ పథకాలు అందించారో వివరిస్తూ ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి సచివాలయ మండల కన్వీనర్ జాజుల చిన్నారి ,వైసిపి సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షులు రావులపాడు సర్పంచి గోళ్ళ సోమేశ్వరరావు, పునుకొల్లు శివరాం ప్రసాద్, పాతూరు రమేష్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** రాష్ట్రంలో ప్రతి పేదవాని బతుకు బాగు చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తపన పడుతున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. పంచాయతీ పరిధిలోని మూడవ సచివాలయం ప్రాంతంలో ఏపీకి ముఖ్యమంత్రి జగనే ఎందుకు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గోరుముచ్చు ఉమా, అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ఘంటసాల:** ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు దేవరకోట సచివాలయం పరిధిలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల నిధుల వివరాలు తెలియజేసే బోర్డును మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు కొప్పుల రాములమ్మ, వైసీపీ నాయకులు వేమూరి రాజేంద్ర, కోప్పుల మునేసు, మద్దాల వెంకటేశ్వరరావు, మద్దాల నరసింహా, దోనేపూడి జానకిరామయ్య నిర్వహించారు. **గూడూరు:** గూడూరు మండలం రామరాజుపాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగన్ కావాలంటే కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారిపై రామరాజు పాలెం అడ్డరోడ్డు వద్ద పార్టీ స్తూపం మరియు జెండా ఆవిష్కరించిన అనంతరం రామరాజు పాలెం గ్రామంలో పర్యటిస్తూ ప్రజలకు జగనన్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రామరాజు పాలెం గ్రామ సర్పంచ్ పరసా రాజులు, గూడూరు మండల అధ్యక్షుడు పర్ణం పెదబాబు, ఎంపీపీ సంఘ మధుసూదన్ రావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం ప్రజారక్షణ భేరి బహిరంగ ప్రదర్శన సభ ఏర్పాట్ల దృశ్యాలు


తోరణాలతో అలంకరణ


బహిరంగ సభ వద్ద టెంట్లు


నగరంలో ముస్తాబు


జెండాలతో అలంకరించిన సర్కిల్


సిద్ధమైన సభా వేదిక


నగరంలో ముస్తాబు


జెండాలతో అలంకరించిన దృశ్యం


రెడ్‌షర్ట్ వాలంటీర్ల ట్రయల్ కవాతుకు స్వాగతం పలుకుతున్న వి.శ్రీనివాసరావు, బాబూరావు, వి.వెంకటేశ్వర్లు

పవర్ లిఫ్టింగ్‌లో కెవిఆర్ విద్యార్థుల ప్రతిభ


విజేతలతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నందిగామ : కష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు ఈ నెల 13న డాక్టర్ జాకీర్ హుస్సేన్ కాలేజ్ ఇబ్రహీం పట్నంలో జరిగింది. ఈ పోటీల్లో నందిగామ కె.వి.ఆర్ కళాశాల విద్యార్థులు 52 కేజీల విభాగంలో సిహెచ్ భవాని వెయిట్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్, పవర్ లిఫ్టింగ్‌లో మౌనిక బ్రాంజ్ మెడల్, పవర్ లిఫ్టింగ్‌లో 52 కేజీలు విభాగంలో శిరీష బ్రాంచ్ మెడల్ సాధించారు. వీరిని కళాశాల యాజమాన్యం ప్రెసిడెంట్ బాబురావు, గోపాలకష్ణమూర్తి, గేమ్స్ కమిటీ సభ్యులు ప్రిన్సిపల్ డాక్టర్ రాయప్ప అభినందనలు తెలిపారు.


బహుమతులందజేస్తున్న దృశ్యం

బాలల హక్కుల వారోత్సవాలు

విజయవాడ : నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా దుర్గాపురం శ్రీ వెంకటేశ్వరరావు మున్సిపల్ పాఠశాలలో ఉన్న బాలలకు సే నో టు డ్రగ్స్ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె నజ్మా మాట్లాడుతూ ఉమ్మడి కష్ణాజిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నవంబర్ 14 నుండి 20 వరకు వివిధ రకాల (ఉపన్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, నాటిక ప్రదర్శన, పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. బాలల హక్కులు బాలల మనుగడ, గుర్తింపు, ఆహారం, పోషకాహారం, ఆరోగ్యం, అభివద్ధి, విద్య, వినోదం, కుటుంబం, బాలలపట్ల నిర్లక్ష్యం, బాలల రక్షణ, బాలల అక్రమ రవాణా, లైంగిక దాడులు, బాలల పరిరక్షణ దష్టిలో ఉంచుకొని ఐక్యరాజ్య సమితి 1989లో ఒక అంతర్జాతీయ ఒప్పందం అయిన 'కన్వెన్షన్ ఆఫ్ ద రైట్స్ ఆఫ్ ద చైల్డ్'ను తీసుకు వచ్చారన్నారు. ఇందులో బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివద్ధి చెందే హక్కు, భాగస్వామ్యపు హక్కులున్నాయని, బాలల హక్కులని అందించవలసిన బాధ్యత మన అందరిది అని అన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్యాం, మహిళ పోలీస్ పి.సాయి ధనలక్ష్మి, బి.మణాళిని పాల్గొన్నారు.


శాంతి కుమారికి అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఇఒ

దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి విచ్చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రధాన కార్యదర్శితో పాటుగా ఎన్‌టిఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితి సింగ్ మరియు అధికారులు ఉన్నారు.

ఊపిరితిత్తుల కేన్సర్‌కు అత్యాధునిక చికిత్స

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న 65 సంవత్సరాల వ్యక్తికి నగరంలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ హాస్పటల్‌లో విజయవంతంగా చికిత్స అందించినట్లు హాస్పటల్ రేడియోషన్ ఆంకాలజిస్టు డాక్టర్ ఎస్.మణికుమార్ తెలిపారు. నగరంలోని హాస్పటల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి వైద్య పరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించి చికిత్సను అందించినట్లు తెలిపారు. తమ వద్దకు వచ్చిన రోగికి మొదట ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సకు సిద్ధం చేయగా, మయోకార్డియల్, ఇన్ఫార్జన్, తీవ్రమైన కార్డియాక్ కోమోర్బిడిటీల కారణంగా శస్త్రచికిత్స అసాధ్యాంగా ఉందన్నారు. ఇటువంటి క్లిష్టతరుణంలో రోగికి ఎంటువంటి ఇబ్బంది లేకుండా అత్యుత్తమ స్థాయిలో చికిత్సను అందించామన్నారు. అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో నిపుణులైన వైద్య సిబ్బందితో పాటు, అత్యాధునిక వైద్య పరికరాల వల్లనే తాము పూర్తిస్థాయి చికిత్సను అందించినట్లు పేర్కొన్నారు.

'చిరుమువ్వలు' పిల్లల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ


ప్రత్యేక సంచికావిష్కరిస్తున్న జెసి సంపత్‌కుమార్

ప్రజాశక్తి - విజయవాడ : బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి తీసుకొచ్చిన "చిరుమువ్వలు" పిల్లల ప్రత్యేక సంచికను ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జె.సి మాట్లాడుతూ... పిల్లల చేత, పిల్లల కొరకు, పిల్లల రచనలతో ముద్రించిన చిరుమువ్వలు ప్రత్యేక సంచిక పిల్లల ఆలోచనలు, వారి రచనల్లో ప్రస్ఫుటమయ్యాయన్నారు. సామాజిక దృక్పదాన్ని వ్యక్తం చేసేవిగా ఉన్నాయి. పిల్లల్లో పుస్తకాలు చదివే సంఖ్య తగ్గిందని, ఇతర కళల మీద ఆసక్తి లేదని, అనుకునే వారికి అవన్నీ ఇంకా ఉన్నాయని ఈ ప్రత్యేక సంచిక చూపిస్తుందని జె.సి అన్నారు. పిల్లలకు సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన ఈ ప్రత్యేక సంచికనను తాను కూడా చదవుతానని చెప్పడం గమనార్హం. ప్రతి పేజీ ఎంతో ఆసక్తిగా జెసి తిలకించారు. ప్రత్యేక సంచికను తీసుకొచ్చిన ప్రజాశక్తి యాజమాన్యాన్ని జెసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి ఉమ్మడి కృష్ణాజిల్లా కన్వీనర్ ఎంబి నాథన్, ప్రజాశక్తి బాధ్యులు యోహాన్, విజయవాడ డివిజన్ ఇన్‌చార్జి చుక్కా శ్రీకాంత్, విలేకరులు వి.హరినారాయణ రాజు, పి.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

గుండె వైద్య నిపుణులు శ్రీనివాస ప్రసాద్ మృతి



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రముఖ గుండె వైద్య నిపుణులు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్. పాటిమళ్ళ శ్రీనివాస ప్రసాద్ సోమవారం రాత్రి సైలెంట్ హార్ట్ ఎటాక్‌తో స్వగహంలో కన్నుమూశారు. కార్డియాలజిస్ట్ శ్రీనివాస్‌గా ప్రసిద్ధి గాంచి కష్ణా జిల్లా, గుంటూరు జిల్లా,ప్రకాశం జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలలో వేల మంది గుండెజబ్బు రోగులకు విశేష సేవలందించారు. 25 సంవత్సరములు గా 30 వేల యాంజియోగ్రామ్, యాంజీయోప్లాస్టీ చికిత్సలు అందించారని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు, చైర్మన్ సీతా రామ్మోహనరావు, వైద్యులు,హాస్పిటల్ సిబ్బంది, పుర ప్రముఖులు నివాళులు అర్పించారు.

'శివాలయం సెంటర్ పేరు మార్చలేదు'



కార్పొరేటర్ చైతన్య రెడ్డి

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక శివాలయం సెంటర్‌లో 15 అడుగుల వైఎస్ఆర్ విగ్రహాన్ని చూచి పోతిన మహేష్‌కి, జనసేన పార్టీకి ఒణుకు మొదలైందని 42వ డివిజన్ కార్పొరేటర్ పి.చైతన్య రెడ్డి విమర్శించారు. మంగళవారం భవానీపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ శివాలయం సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం పెట్టాం కానీ, ఆ సెంటర్ పేరు మార్చ లేదని, ఆ పేరు అలాగే ఉందని, ప్రజలను తప్పు దోవ పట్టించేందుకే జనసేన నాయకులు పోతిన మహేష్ ప్రయత్నిస్తున్నారని అన్నారు.

డిసెంబరు 28 నుండి 34వ పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబరు 28 నుండి జనవరి 7 వరకు 34వ విజయవాడ బుక్ ఫెస్టివల్ నిర్వహించనున్నామని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.మనోహర్‌నాయుడు, లక్ష్మయ్య తెలిపారు. గవర్నరుపేటలోని సొసైటీ కార్యాలయంలో పుస్తక మహోత్సవ్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఉదయం ఏపీ స్టేట్ మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్ ఏ.మహమ్మద్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా విజయవాడ నగరంలో పుస్తక మహోత్సవ్ నిర్వహిస్తారని, ఎంతో మంది పుస్తక మహోత్సవ్ కోసం ఎదురు చూస్తుంటారని అటువంటి ప్రదర్శన డిసెంబరు 28 నుండి నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సొసైటీ కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ 34వ పుస్తక మహోత్సవ్ డిసెంబరు 28 నుండి నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో జరుగు తుందన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్

పుస్తక ప్రదర్శన ప్రారంభం

నగరంలోని విజయ వాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా పుస్తక ప్రదర్శనను మంగళవారం ఉదయం ఏపీ మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్ ఏ.మహ్మద్ ఇంతియాజ్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమి బహుమతి గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డాక్టర్ రావిశారద పాల్గొన్నారు.